క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 25న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కిషన్‌పుర ప్రాంతంలో ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు, వినాయక నగర్, భవానినగర్, గోకుల్‌నగర్, అశోక కాలనీ, రాంనగర్, పోలీసు హెడ్‌క్వార్టర్స్, బాలసముద్రం, నక్కలగుట్ట ప్రాంతాల్లో ఉదయం 9.30గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'ఇన్‌స్పెక్టర్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలి'

హన్మకొండ అర్బన్: బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌పై విచారణ చేసి ఉద్యోగం నుంచి తొలగించాలని డీవైఎఫ్ఐ యంగ్ ఉమెన్స్ జిల్లా నాయకురాలు సీహెచ్.శిరీష డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలు, విద్యార్థినులు, యువతులపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారాలు, దాడులను అరికట్టాల్సిన పోలీసులే లైంగిక దాడులకు పాల్పడటం దుర్మార్గమని విమర్శించారు. మహిళలు, యువతులపై వేధింపులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగించాలని సూచించారు.

తైక్వాండోలో విద్యార్థికి సిల్వర్ మెడల్



హసన్‌పర్తి: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో భీమారంలోని స్కిల్‌స్ట్రోక్ ఇంటర్నేషన్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న జయగిరికి చెందిన తాళ్లపల్లి స్నిగ్ధ పాల్గొని సిల్వర్ మెడల్ సాధించింది. గద్వాల్ ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని పాఠశాల డైరెక్టర్ ఎర్రబెల్లి అనూప్‌కుమార్, ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అభినందించారు.

పద్మశాలి కులస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి

వరంగల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది విశ్వ విద్యాలయాలకు ఉపకులపతులను ఇటీవల నియమించినా అందులో ఒక్క పద్మశాలి, ఇతర చేనేత కులాలకు చెందిన వారికి అవకాశం కల్పించలేదని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోడం రవిప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత పదవుల నియామకాల్లో పద్మశాలి సమాజానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అర్హత గల అనేకమంది ఉన్నత విద్యావంతులు, డాక్టరేట్లు గల మేధావులు చేనేత సమాజానికి చెందినవర్గంలో ఉన్నప్పటికీ ప్రభుత్వం మొండి చేయి చూపిందని పేర్కొన్నారు. తెలంగాణ సమాజంలో పద్మశాలి, దేవాంగ, కుర్ని, నీలకంఠ, కర్ణ భక్తులు, కరికాల, కైకాల భక్తులు, పట్టుశాలి, స్వకుల శాలి, నీలి, ఖత్రి, భావసార క్షత్రియ, జాండ్ర, తొగటవీర క్షత్రియ, సేనాపతులు, సాధనాశురులు మొత్తం 18 చేనేత కులాలకు చెందిన వారు జనాభాలో సుమారు 16శాతం ఉన్నారని రవిప్రకాశ్ వివరించారు.

సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన పాలకుర్తి ఎస్సై

హసన్‌పర్తి: పాలకుర్తి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన పవన్‌కుమార్ గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి మొక్క అందజేశారు.

ఉపాధ్యాయురాలికి అభినందన



ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీ) ఫైనల్ ఇయర్ చదువుతున్న సుమయఫిర్దోస్ ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. ఈమేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆమెను ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు గురువారం అభినందించారు. అధ్యాపకులు శ్రీనివాసులు, పీఎల్ఎన్ మూర్తి, శ్రీధర్, భగీరత్, రమేష్, చారి, సుస్మిత శైలజ, రాజన్న, గీత, షరీఫ్ పాల్గొన్నారు.

18 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

మడికొండ: మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని అమ్మవారిపేట గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసులు పట్టుకున్నట్లు మడికొండ ఎస్సై రాజబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అమ్మవారిపేట శివారు ఫౌల్ట్రీ ఫామ్‌లో 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కనుమరుగవుతున్న బుర్రకథలు

- కళాకారులకు బతుకుదెరువు కరువు
- ఉపాధి లేక రోడ్డున పడిన కుటుంబాలు



బుర్రకథ చెబుతున్న కళాకారులు (ఫైల్)

కాజీపేట : ఒకప్పుడు మహారాజులనే మెప్పించి భళా.. అనిపించుకున్న బుర్రకథలు నేడు పూర్తిగా కనుమరుగైపోయాయి. ఒకప్పుడు ఈ వృత్తినే జీవనాధారంగా ఎంచుకున్న కళాకారులకు నేడు బతుకుదెరువు కొరవడడంతో ఇతర పనులు చేసుకుంటున్నారు. వీరగాథలు, పురాణ కథలు, చారిత్రక ఘట్టాలు తమదైన భావవిన్యాసాలతో హాస్యాస్పదమైన చలోక్తులతో కథను ఆద్యంతం రసవత్తరంగా నడిపించే కళాకారులకు జిల్లాలో కొదువలేకున్నా వాటిని ఆదరించే వారే కరువవుతున్నారు.

ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు

నేటి తరానికి బుర్రకథ అంటే ఏంటో తెలియని పరిస్థితులు దాపురించాయి. శతాబ్దాల చరిత్ర ఉన్న ఈ కళను సజీవంగా కొన్నేళ్లపాటు భావితరాలకు అందించే ప్రయత్నాలు ఎక్కడ జరగకపోవడం బాధాకరం. స్వాతంత్య్రోద్యమంలో బుర్ర కథల ప్రాధాన్యత ఎనలేనిగా చెప్పొచ్చు. ఎంతో మందిని ఈ బుర్ర కథలు ఐక్యంగా స్వాతంత్య్రోద్యమం వైపు కదిలించాయి. సామాజిక సమస్యలపై గ్రామీణ, పట్టణ ప్రజలను కదలించి ఉద్యమ స్ఫూర్తిని రగిలించాయి. పల్లెల్లో దేశభక్తి, చైతన్యం రగిలించిన బుర్రకథ చెప్పేవాళ్లు నేడు చూద్దామన్నా ఎక్కడా కానరావడం లేదు. ఒకప్పుడు అనేక కుటుంబాలకు జీవనాధారమైన ఈ కళకు ప్రేక్షక ఆదరణ నానాటికి తగ్గింది. సత్ఫలితంగా కళలనే నమ్ముకున్న కుటుంబాలకు బతుకుదెరువు కరవై రోడ్డున పడ్డాయి. మది నిండా కళ నైపుణ్యం ఉన్నా ఆదరణ కరవై విధిలేని పరిస్థితుల్లో కళారంగాన్ని వదిలి కూలీనాలి పనులకు వెళ్తూ దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంతో మంది కళాకారులు ఆ రోజుల్లో ప్రతిఫలం పెద్దగా ఆశించకుండా గ్రామాల్లో ప్రదర్శనలు ఇచ్చి ప్రజల చేత శభాష్ అనిపించుకున్నారు. ప్రేక్షకులు కొట్టే చప్పట్లే వారి మది నిండా ఎనలేని ఉత్సాహాన్ని నింపేవి. ఆనాడు బుర్ర కథలనే నమ్ముకుని ప్రదర్శనలతో కాలం గడిపిన కళాకారులు నేడు వృద్ధులుగా మారిపోయారు. సినిమాలు, టీవీల రాకతో ఈ కళ అడుగంటిపోయింది. ఈ నేపథ్యంలో నూతన కళాకారులు ఎవరూ ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో బుర్ర కథలకు దాదాపుగా కాలం చెల్లిందనే భావించవచ్చంటున్నారు నాటి తరం వృద్ధులు.

బుర్ర కథను ప్రోత్సహించాలి



దేశ స్వాతంత్య్రోద్యమంలో కీలకపాత్ర పోషించిన బుర్ర కథకు నేడు ఆదరణ కొరవడింది వాస్తవం. టీవీలు, సినిమాల రాకతో పాటు సోషల్ మీడియారంగ ప్రవేశం సైతం నాటకాలు, రంగస్థల కార్యక్రమాలను తెరమరుగు చేసింది. ప్రభుత్వాలు కళాకారులను ప్రోత్సహించాలి.

- ఆర్.రాజ్‌మోహన్‌రావు, రిటైర్డ్ ఉద్యోగి, ప్రశాంత్‌నగర్

వృద్ధ కళాకారులను ఆదుకోవాలి



ప్రేక్షకుల అభినందనలే ఆశీస్సులుగా.. కళనే నమ్ముకుని జీవించిన అనేక మంది నేడు వృద్ధాప్య దరిచేరడంతో చేతిలో చిల్లిగవ్వ కూడా లేక ఖర్చులు వెళ్లక అవస్థలు పడుతున్నారు. అలాంటి వారిని గుర్తించడానికి అధికారులు సర్వే చేయాలి. ప్రభుత్వం స్పందించి వారందరిని గుర్తించి పింఛన్లు అందించి ఆదుకోవాలి.

- బొల్లికొండ కోటేశ్వర్, సోమిడి

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. 49, 59వ డివిజన్లలోని హనుమకొండ సాయి కాలనీలో రూ.6 లక్షలు, ఇందిరానగర్, స్నేహనగర్‌లో రూ.66 లక్షలతో నిర్మించనున్న అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ పనులకు ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని అన్నారు. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం రూ.50 కోట్ల నిధులు మంజూరు చేసిందని వివరించారు. కాజీపేట బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.11కోట్లు విడుదల చేసిందని తెలిపారు. నగరంలో నల్లాలు, సైడ్ డ్రైన్, వరద ముంపు నివారణకు డీపీఆర్ తయారీ ప్రక్రియ కోసం టెండర్ ప్రక్రియ ముగిసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వరంగల్ అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేటర్లు ఏనుగుల మానస, గుజ్జుల వసంత, నాయకులు, కాల నీవాసులు రాంప్రసాద్, రవి కిరణ్, కేతిడి దీపక్ రెడ్డి, తేళ్ల సుగుణ, రాజమల్ల రెడ్డి, రఘుపాల్ రెడ్డి, దొంగరి శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, కరణ్, సతీష్, శశికాంత్ రెడ్డి, రాజా సుధాకర్ రెడ్డి, అశోక్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, జగ్గారెడ్డి, కిషన్ రావు, కరుణాకర్, అధికారులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లే



ఏసీపీకి సర్టిఫికెట్ అందజేస్తున్న డీసీపీ రవీందర్

ఖిలా వరంగల్: యువత సన్మార్గంలో పయనిస్తూ సమాజ సేవకు అంకితం కావాలని వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ సూచించారు. సేవాభావంతో రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని మామునూరు సబ్ డివిజన్ ఏసీపీ తిరుపతి ఆధ్వర్యంలో ఐనవోలు, పర్వతగిరి, గీసుగొండ, ఏనుమాముల, మామునూరు పోలీస్‌స్టేషన్ల నేతృత్వంలో ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఫార్మసీ కళాశాలలోని ఆడిటోరియంలో మెగా రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రవీందర్ హాజరై ఏసీపీ తిరుపతితో కలిసి మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానంపై అపోహలను వీడాలని అన్నారు. ఒక్క రక్తపు చుక్క నిండు ప్రాణాలను కాపాడుతుందని పేర్కొన్నారు. పోలీసులు సేవా దృక్పథంతో తమ విధులు నిర్వహించాలని, ఆపదలో ఉన్న వారిని కాపాడేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. అనంతరం ఎంజీఎం డాక్టర్ ఆశా మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల వచ్చే లాభాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంజీఎం బ్లడ్ బ్యాంక్ టెక్నీషన్లు 276యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో వాగ్దేవి విద్యాసంస్థల అధినేత దేవేందర్‌రెడ్డి, సీఐలు రాజగోపాల్, రాఘవేంద్ర, మహేందర్, రమేష్, ఎస్సైలు శ్రీకాంత్, కృష్ణవేణి, శ్రీకాంత్, రాజు, శ్రీనివాస్, నరేష్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

కేయూ వీసీకి పలువురి అభినందనలు



వీసీని సన్మానిస్తున్న కృష్ణమాదిగ, తదితరులు



సదస్సుకు ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వీసీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, తదితరులు గురువారం వీసీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణమాదిగ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని వీసీని కోరారు. కార్యక్రమంలో కేయూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్, పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ వెంకట్, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ బాధ్యులు బొక్క మొగిలి, డాక్టర్ సత్య జాల, డాక్టర్ వడ్డెపెల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

వీసీని కలిసిన ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల అధ్యాపకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వీసీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డిని హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి, అధ్యాపకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఈనెల 25న పింగిళి కళాశాలలో నిర్వహించనున్న తెలుగు విభాగం జాతీయ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొనాలని వారు ఆహ్వానించారు. ఈమేరకు ఆహ్వాన పత్రాన్ని వీసీకి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ, అధ్యాపకులు మధు, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, రాజు, సారంగపాణి, రాంరెడ్డి, డాక్టర్ లకన్ సింగ్ పాల్గొన్నారు. అలాగే, హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ అధ్యాపకులతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ సంజీవయ్య, తదితరులు వీసీని కలిసి అభినందనలు తెలిపారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి



పైడిపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ

దేశాయిపేట: సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వరంగల్ డీఎంహెచ్ఓ కాజీపేట వెంకటరమణ అన్నారు. గురువారం పైడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేసి ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నమోదైన డెంగీ వ్యాధిగ్రస్తుల ఇళ్లను క్షేత్రస్థాయిలో పర్యటించి పలు సూచనలు చేయాలని సూచించారు. వైద్యాధికారి ప్రశాంతి, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రుడు

మడికొండ: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మడికొండ శివారు పెద్దమ్మ ఆలయం వద్ద గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన మాచర్ల శ్రావణ్ వ్యక్తిగత పనిమీద కాజీపేటకు వెళ్లి తిరిగి తన ద్విచక్రవాహనంపై ధర్మసాగర్‌కు వెళ్తున్నాడు. ధర్మసాగర్ నుంచి మడికొండ వైపు వెళ్తున్న ఆటో ముందు లైట్ లేకుండా వెళ్తోంది. ఈక్రమంలో పెద్దమ్మ ఆలయం వద్ద ఆటో, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీ కొట్టుకున్నాయి. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న శ్రావణ్‌కు తీవ్ర గాయాలు కాగా, 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

దేవాదాయ శాఖ పరిధిలోకి ఆలయాలు



రికార్డులను పరిశీలిస్తున్న ఈఓ వెంకట్రావ్

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్ కాశిబుగ్గలోని కాశీవిశ్వేశ్వర, రంగనాథ స్వామి దేవాలయాలు ఇక నుంచి దేవాదాయ శాఖ ఆధీనంలో కొనసాగుతాయని ఈఓ వెంకట్రావు తెలిపారు. దేవాదాయ శాఖ అధికారులు గురువారం ఆ రెండు ఆలయాలను సందర్శించి ఆలయ అభివృద్ధి కమిటీల నుంచి హుండీల తాళాలు తీసుకుని సీల్ వేశారు. ఆలయాలకు సంబంధించిన బ్యాంకు ఖాతా, తదితర వివరాలు తీసుకుని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ, హిందూ సంఘాల నాయకులు, స్థానికులు ఆలయాల వద్దకు చేరుకుని దాతల సహకారంతో సజావుగా నడిచే ఆలయాలను దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకోవడం సరికాదని నిరసన తెలిపారు. ఈమేరకు అధికారులు స్పందిస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల మేరకే తాము ఆలయాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.అనిల్‌కుమార్, ఆలయాల అభివృద్ధి కమిటీ సభ్యులు బయ్యా స్వామి, గోనె జగదీశ్వర్, గుండేటి కృష్ణమూర్తి, వంగరి రవి, మండల శ్రీరాములు, వైకుంఠం, కూరపాటి రోజా, ఆలయాల అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాల్మీకి నవరాత్రోత్సవాలు



అన్నదాన కార్యక్రమంలో జంగా, తదితరులు

మడికొండ: వాల్మీకి నవరాత్రోత్సవాల్లో భాగంగా వాల్మీకి ఆలయం వద్ద గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మినుగు రాంచందర్ కుటుంబ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయిల్ సీడ్ రాష్ట్ర చైర్మన్ జంగా రాఘవరెడ్డి ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం వాల్మీకి ఊరేగింపు నిర్వహించనున్నటు వాల్మీకి సంఘం అధ్యక్షుడు బోగి లింగమూర్తి తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం కులస్తులు పేర్ల సురేష్, కుర్ల మోహన్, మినుగు సతీష్, కంచనపల్లి వెంకటయ్య, బోగి లింగయ్య, ముస్కె సాంబయ్య, నిగ్గుల వెంకటప్రసాద్, బోగి శ్రీనివాస్, మండల సురేష్, ముచ్చు అర్జున్, బోగి కృష్ణ, తిరుపతి, వినయ్, కార్తీక్, విజయ్, రవీందర్, మినుగు సతీష్, భరత్, వీరేష్, ఉదయ్, సందీప్, నాయకులు బైరి లింగమూర్తి, పైడిపాల రఘుచందర్, పల్లపు అర్జున్, వస్కుల శ్రీనివాస్, పాల్గొన్నారు.

రేపు మాదిగల ధర్మయుద్ధం మహాసభ



మాట్లాడుతున్న ఉమామహేష్

కాజీపేట: హనుమకొండ డీ-కన్వెన్షన్ హాల్‌లో శనివారం జరగనున్న ఉమ్మడి వరంగల్ జిల్లా మాదిగల ధర్మయుద్ధం మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రేణుకుంట్ల ఉమామహేష్ మాదిగ కోరారు. కాజీపేట మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతున్న సభకు మాదిగలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజారపు క్రాంతి, టి.మల్లేశం, కిరణ్, బాబాబాయ్ పాల్గొన్నారు.

సీతారామచంద్ర ఆలయంలో పూజలు



ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

మడికొండ: పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారామచంద్ర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. యాగశాలలో గణపతి హోమం, రుద్ర హోమం నిర్వహించారు. శ్రీరాముడి జన్మనక్షత్రం సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చకులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శేషభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ, మణిశర్మ, సాయిశర్మ, భక్తులు అద్దెంకి సురేష్, వెంకన్న, నర్సింహ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌కు ఆహ్వానం

ఖిలా వరంగల్: వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నరేందర్‌ను నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్లి రవి, సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. దీపావళిని పురస్కరించుకుని ఈనెల 30న రాత్రి వరంగల్ ఉర్సు గుట్ట రంగలీల మైదానంలో నిర్వహించనున్న నరకాసుర వధ కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా నరేందర్‌కు ఆహ్వాన ప్రతికను అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు శతపతి, శ్యామల రావు, ఆవునూరి రామ్మూర్తి, వనం కుమార్, మరుపల్లి గౌతం, దూడ కొమురెల్లి, కొమ్మురాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు క్యాంపు



సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

వరంగల్: వరంగల్ హెడ్ పోస్టాఫీసు సెంటర్‌లో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వరంగల్ జిల్లా సభ్యత్వ నమోదు క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందీశ్వర్ పాల్గొని మాట్లాడుతూ దేశంలో ప్రజానీకంప్రధాని మోదీ పాలనకు మద్దతు పలుకుతున్నారని, ఈక్రమంలో అధికశాతం మంది సభ్యత్వాలు తీసుకుంటున్నారని తెలిపారు. సంయుక్త మోర్చాల రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కాసు శిల్ప మాట్లాడుతూ వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 66 వేల మంది స్వచ్ఛందంగా సభ్యత్వం పొందారని గుర్తుచేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, సభ్యత్వ జిల్లా ప్రముఖ్ కుసుమ సతీష్, సరిత, కల్పన, సుమతి, సుజాత, దేవిక, అపర్ణ, శర్య, జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్ పాల్గొన్నారు.

జానపద స్వరాల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, కళాకారులు

హన్మకొండ కల్చరల్: వరంగల్ జేబీ కల్చరల్ సొసైటీ 25 ఏళ్ల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఓరుగల్లు జానపద స్వరాలు ఆటపాటల జాతర -2024 ఈనెల 27న హనుమకొండ నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు సంబంధిత వాల్‌పోస్టర్లను వరంగల్ పోచమ్మమైదాన్‌లోని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆయన నివాసంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడల శివ మాట్లాడుతూ ఆటపాటల జాతరలో కళాకారులకు కీర్తి పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. నగర ప్రజలు, కళాకారులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గణేష్, జనగాం రాము, ఆలేటి శ్యాంసుందర్, తోట రవీందర్, యాదగిరి, గడ్డం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

కాజీపేట: తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్‌భాస్కర్ జన్మదిన వేడుకలను కాజీపేట చౌరస్తాలో బీఆర్ఎస్ కార్యకర్తలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో కలిసి 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు కేక్‌కట్ చేశారు. అనంతరం ఆస్పత్రుల్లోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నార్లగిరి రమేష్, పాలడుగుల శివకుమార్, దువ్వ కనకరాజ్, సుంచు కృష్ణ, మర్యాల కృష్ణ, నయీంజుబేర్, వినయ్, సర్వర్, తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ సొసైటీ కార్యవర్గం ఎన్నిక



ఉత్తర్వులు అందజేస్తున్న ఎన్నికల అధికారులు

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ 'కాశిబుగ్గ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్' నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంది రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సామల వెంకటస్వామి, కార్యదర్శిగా రాయపురి కృష్ణమూర్తి, కోశాధికారిగా పోతు నాగిరెడ్డి, డైరెక్టర్లుగా గడ్డం సతీష్‌కుమార్, గౌరిశెట్టి సంపత్, నర్సింగోజు నర్సింహచారి, బేతి పద్మ, మహమ్మద్ కౌసర్ సుల్తానా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. వారు ఐదేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈమేరకు వారిని పలువురు అభినందించారు.

దర్గా ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి సన్మానం



విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

కాజీపేట రూరల్: తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హెచ్ఐవీ / ఎయిడ్స్ క్విజ్ కాంపిటీషన్‌లో కాజీపేట దర్గా ప్రభుత్వ ఉన్నత పాఠశాల జాగీరుకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఎండీ.కరీముల్లా పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. నవంబర్‌లో జరగనున్న రీజినల్ స్థాయి క్విజ్ కాంపిటీషన్‌కు ఎంపికయ్యాడు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థి కరీముల్లాను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హెడ్‌మాస్టర్ ఎన్ఎంఎం.స్వామి, ఉపాధ్యాయులు, రాజమోహన్ అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయశ్రీరజాలి, మాజీ కార్పొరేటర్ అబుబక్కర్ పాల్గొన్నారు.

నీరా.. తనివితీరా



కాజీపేట: ఈత చెట్ల నుంచి ఉదయం పూట తీసే నీరాకు ప్రజల నుంచి విశేష ఆదరణ ఉంది. ఈ నీరాలో అనేక ఔషధ గుణాలున్నాయని, అది తాగితే రోగ నిరోధక శక్తి పెరుగుతుందనే భావన ఉంది. షుగర్ పేషంట్లకు దివ్య ఔషధంగా పని చేస్తుందనే నమ్మకంతో చాలా మంది నీరా తాగేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కాజీపేట మండల కేంద్రం శివారులో ఉన్న అనేక గ్రామాల్లో ఈత చెట్ల నుంచి గీత కార్మికులు ఉదయం, సాయంత్రం నీరా సేకరించి విక్రయిస్తున్నారు. ఉదయం పూట తీస్తున్న నీరా కొనుగోలుకు అనేక మంది ముందుకు వస్తుండడంతో నీరాకు మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉంది. ముందస్తుగా ఫోన్లలో నీరాకు ఆర్డర్ చేసి మరీ కొనుగోలు చేస్తున్నారు.